

ఆసుపత్రిలో వైద్యులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

పేదోడికి అందని వైద్యం

- జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందని ద్రాక్షగా వైద్యం
- ఆసుపత్రుల ముఖం చూడని కొందరు వైద్యులు
- ఉన్నవారు సమయపాలన పాటించని పరిస్థితి
- తాజాగా పిట్లం ఆసుపత్రి ఎదుట వైద్యులు రావడం లేదని రోగుల ఆందోళన
- మరికొన్ని ఆసుపత్రుల్లో వైద్యుల కొరత
- ఓ వైపు విజృంభిస్తున్న విష జ్వరాలు
- ప్రభుత్వ ఆసుపత్రులకు పెరిగిన రోగుల తాకిడి
- కలెక్టర్ ఆదేశించినా పట్టింపులేని ప్రభుత్వ వైద్యులు
- ఆసుపత్రులను కలెక్టర్ తనిఖీ చేస్తున్నా వైద్యుల్లో రాని మార్పు



పిట్లం ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న రోగులు, వారి బంధువులు



కామారెడ్డి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓ వైపు విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరాలతో పల్లెలు మంచాన పడుతుండగా రోగులు ఆసుపత్రులకు బారులు తీరుతున్నారు. ఇలాంటి సమయంలో పేదలకు వైద్యం అందించాల్సిన వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పేదోడికి వైద్యం అందని ద్రాక్షలా మారుతుంది. మధ్యాహ్నం 11 దాటినా పిట్లం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వైద్యులు రాకపోవడంతో రోగులు వైద్యం కోసం ఆసుపత్రి ఎదుట నిరసన తెలపాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇలా పిట్లం ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాకుండా జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లోనూ పలువురు వైద్యులు సమయపాలన పాటించడం లేదు. కొందరు వైద్యులైతే ఆసుపత్రి వైపే చూడడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. సదరు వైద్యులకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో పై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు అందించడంపై ఆసక్తి చూపడం లేదని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలు జారీ చేయడమే కాకుండా ఆకస్మిక పర్యటనలు చేస్తున్నా ప్రభుత్వ వైద్యుల్లో మాత్రం మార్పు రావడం లేదు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న సమయంలోనూ మానవ దృక్పథంతో పేదలకు వైద్యం అందించాల్సిన ప్రభుత్వ వైద్యులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

విజృంభిస్తున్న విష జ్వరాలు

జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతుండడంతో పలుచోట్ల గుంతలు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిలిచి దోమలు, ఈగలకు నిలయాలుగా మారుతున్నాయి. ఈ క్రమంలోనే కీటక జనిత వ్యాధులతో పాటు సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటివి వ్యాపించే ప్రమాదం ఉందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా మారుమూల గ్రామాలు, మురికివాడల్లో పారిశుధ్య పనులు లోపిస్తున్నాం ఎం. దీంతో వందల కొద్ది డెంగీ కేసులు నమోదు అవుతున్నాయి. రోజురోజుకూ డెంగీ కేసులు పదు ల సంఖ్యల్లోనే నమోదవుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా వైద్యఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం 90కి పైగానే కేసులు నమోదయ్యాయి. కానీ అనధికారికంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో పదుల సంఖ్యలోనే డెంగీ, టైఫాయి డ్, మలేరియా లాంటి కేసులు నమోదవుతున్నాయి. గ్రామాల్లో పెద్ద ఎత్తున కేసులు నమోదవుతున్నా వైద్య సిబ్బంది మాత్రం తమ విధులలో అలసత్వం వీడడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

వేధిస్తున్న వైద్యుల కొరత

జిల్లాలో కామారెడ్డి గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రితో పాటు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఎల్లారెడ్డి,బాన్సువాడ ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు సామాజిక ఆరోగ్య కేంద్రాలు బిచ్కుంద, గాంధారి, పిట్లం, దోమకొండ, మద్నూర్, జుక్కల్‌లలో ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 106 పల్లె దవాఖానాలు, 23 పీహెచ్‌సీలు, ఉప ఆరోగ్య కేంద్రాలు 169, బస్తీ దవాఖానాలు 4 ఉన్నాయి. కాగా బిచ్కుంద ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో జారీ అయినప్పటికీ సరైన వసతులు, వైద్యుల కేటాయింపు చేపట్టలేదు. ఎల్లారెడ్డి ఆసుపత్రి సైతం 30 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రికి అప్‌గ్రేడ్ అయి న క్యాడర్ ఏర్పాటులో తీవ్ర జాప్యం నెలకొనడంతో అక్కడ వైద్యం అందని ద్రాక్షగానే మారుతుంది. ఇక మిగిలిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో ప్రభుత్వ ఆసుపత్రులకు రోజురోజుకూ రోగుల తాకిడి పెరుగుతోంది. ప్రధానంగా కామారెడ్డి జీజీహెచ్‌తో పాటు పిట్లం, బాన్సువాడ, ఎల్లారెడ్డి, దోమకొండ ఆసుపత్రులలో రోగులు వైద్యం కోసం వస్తుంటారు. ఈ ఆసుపత్రులలో పూర్తిస్థాయిలో వైద్యు లు, సిబ్బంది లేక వైద్యం అందడంలేదు. ప్రభుత్వాలు మారుతున్నా ఆసుపత్రుల్లో మాత్రం వైద్యుల కొరత తీర్చడం లేదు. ప్రధానంగా సీజనల్ వ్యాధుల సమయంలో రోగులు ఆసుపత్రుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరికి సరైన వైద్యం అందక చనిపోయిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఇటీవల పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యులు లేరంటూ రోగులు ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు.

సమయపాలన పాటించని వైద్యులు

పిట్లం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యాధికారులు విధులకు రాకపోవడంతో రోగులు, వారి బంధువులు బుధవారం ఆసుపత్రి వద్ద తోపుడు బండ్లు అడ్డుగా పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తీవ్ర జ్వరాలతో ఇబ్బందులు పడుతూ ఆసుపత్రికి వస్తే వైద్యులు అసలు అందుబాటులోనే ఉండడం లేదని ఆరోపించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఉన్నప్పటికీ విధులకు మాత్రం హాజరుకావడం లేదని తెలిపారు. గత మూడు రోజులుగా పిట్లంకు చెందిన కిరణ్ అనే వ్యక్తి తన కూతురు అవంతిక ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నా వైద్యులు పట్టించుకోవడం లేదని రోగులతో కలిసి ఆసుపత్రి ప్రధాన గేటుముందు బైఠాయించారు. ఉదయం 11 దాటిన వైద్యాధికారులు రాకపోవడంతో దాదాపు గంటపాటు వేచి చూసి ఏం చేయలేని పరిస్థితుల్లో నిరసన తెలుపాల్సి వచ్చిందని వాపోయారు. చిన్నారులు, గర్భిణులు వైద్యం అందక నేలపైనే పడుకుంటున్నారని తెలిపారు. అయితే గత కొద్దిరోజులుగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పీహెచ్‌సీ, సీహెచ్‌సీలను తనిఖీలు చేపడుతున్నారు. ఓ మండలంలో సైతం విధులకు హాజరుకాని సిబ్బందిని సస్పెండ్ చేసిన సంఘటనలు ఉన్నాయి. ప్రతీ పీహెచ్‌సీని, సీహెచ్‌సీలలో హాజరు పట్టికను పరిశీలించడంతో పాటు సిబ్బందికి ఆదేశాలు పకడ్బందీ చర్యలు చేపట్టాలని లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేస్తున్నారు. సీజనల్ వ్యాధులపై మంగళవారం సైతం ఆయా మండలాల అధికారులు వీసీ ద్వారా సూచనలు చేసినప్పటికీ అధికారులు మరుసటి రోజే ఈ విధంగా వ్యవహరించడం, సిబ్బంది పనితీరుపై ఆ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో కొనసాగుతుందనేదానిపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



ఆసుపత్రి వద్ద తోపుడు బండ్లు అడ్డంగా పెట్టి నిరసన తెలుపుతున్న రోగులు

వినాయక చవితికి పకడ్బందీ చర్యలు చేపట్టాలి

ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 28: వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలో సమస్యాత్మక గ్రామాలను పోలీసు అధికారులు పరిశీలించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎస్పీ సింధూశర్మ తెలిపారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌ల పరిధిలో ట్రబుల్ మాంగర్స్, తరచుగా తగాదాలకు, నేరాలకు పాల్పడేవారిపై నిఘా ఉంచాలని పీస్ కమిటీ మీటింగ్‌లు ఏర్పాటు చేసి మండపాల నిర్వాహకులతో మాట్లాడాలని అన్నారు. జిల్లాలో ఎక్కువగా నేరాలు జరిగే ప్రాంతాల్లో హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేసి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్రైమ్ మ్యాపింగ్ తయారు చేసి అక్కడ నేరాల నియంత్రణకు తీసుకోవాలని చర్యలను సిబ్బందికి తెలిపారు. అలాగే గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలో ఏఏ అంశాలు క్రోడీకరించాలనే అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతీ విషయాన్ని కూలంకుశంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలని, పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని తెలిపారు. కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకొని విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, డీఎస్‌ఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జార్జ్, జిల్లా సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ

వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 28: వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కామారెడ్డి మండలంలోని గర్గుల్ పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో గల ఓపీ, రక్త పరీక్షల ల్యాబ్, ఫార్మసి సంబంధించిన వాటిని తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలలో పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హాజరు వివరాలపై వాకబు చేసి ప్రస్తుత వర్షాల నేపథ్యంలో ప్రజలపై సీజనల్ వ్యాధుల ప్రభావం అధికంగా చూపుతాయని జ్వరపీడిత సర్వే పకడ్బందీగా నిర్వహించి సీజనల్ వ్యాధులపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశలు ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా గర్గుల్ ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో సంభాషించారు. విద్యార్థుల పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు వేసి వారి సమాధానాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించి మండలంలోని విద్యార్థులందరు షెడ్యూల్ ప్రకారం వినియోగించుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఈవో రాజు, జడ్పీ సీఈవో చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నూతన ఓటరు జాబితా తయారీకి పార్టీలు సహకరించాలి

నూతన ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓటరు జాబితా నమోదు అనేది నియంత్ర ప్రక్రియ అని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ సర్వేచేసి చనిపోయిన ఓటర్ల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, ఇతర ప్రాంతాల నుంచి షిఫ్ట్ అయిన వారి పేర్లను జాబితాలో చేర్చడం, ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ అయిన వారి పేర్లను తొలగించడం, 1 జనవరి 2025 వరకు 18 సంవత్సరాల వయస్సు నిండిన వారిని ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి,బాన్సువాడ, ఎల్లారెడ్డి ఆర్‌డీవోలు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయరా?

- భిక్కనూరులో పూర్తి అయిన ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్
- ఇటీవల తామే లబ్ధిదారులమని తాళాలను పగులగొట్టి ప్రవేశాలు
- అడ్డుకున్న అధికారులు



బస్వాపూర్‌లో ప్రవేశించిన వారిని సముదాయిస్తున్న అధికారులు

భిక్కనూరు, ఆగస్టు 28: భిక్కనూరు మండలంలోని బస్వాపూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పూర్తి అయినప్పటికీ ఇప్పటికీ లబ్ధిదారులకు మంజూరు చేయలేదు. దీంతో వాటిని గతంలో గ్రామసభల ద్వారా ఎంపిక చేసిన వారికి అందజేయాలని రోజురోజుకూ ఆందోళనలు పెరుగుతున్నాయి. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలోని పశువుల మార్కెట్ సమీపంలో, బస్వాపూర్ గ్రామంలో పెద్దమల్లారెడ్డి గ్రామానికి వెళ్లే దారిలో హనుమాన్ ఆలయం పక్కన, భిక్కనూరు మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన, రామేశ్వర్ గ్రామంలో గ్రామ పంచాయతీ సమీపంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి లబ్ధిదారుల ఎంపిక కోసం గతంలో గ్రామసభ నిర్వహించి ఎంపిక చేశారు. కానీ వారికి అధికారికంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయలేదు. అప్పటికే ఎన్నికలు రావడంతో బీఆర్‌ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి రావడంతో ఇటీవల ఇప్పటి వరకు పంపిణీ చేయని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి గ్రామాల్లో ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్న వారిని మాత్రమే ఎంపిక చేశారని గ్రామాల్లో అర్హులైనా వారు చాలా మందే ఉన్నారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో మరల ప్రత్యేక సభలను నిర్వహించి అసలైనా అర్హులను గుర్తించి వారికే డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని పలువురు డిమాండ్ చేస్తుండటంతో గ్రామాల్లో గొడవలు పెరుగుతున్నాయి. ఇటీవల మండలంలోని పెద్దమల్లారెడ్డి, బస్వాపూర్ గ్రామాల్లో రాత్రికి రాత్రి ఒక్కసారిగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల తాళాలను పగులగొట్టి లోనికి వెళ్లి వాటిని శుభ్రం చేసుకుని ఇంటికి వారి పేర్లను రాసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు చేరుకుని వారిని సముదాయించి వారిని బయటకు పంపి తిరిగి వాటికి తాళాలు వేశారు.

పూర్తి అయిన ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్

భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి, బస్వాపూర్ గ్రామాల్లో పూర్తి అయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను గతంలో ఎంపిక చేసిన వారికి వెంటనే పంపిణీ చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి అయి లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ ఎందుకు ప్రభుత్వం పంపిణీ చేయడం లేదని, వెంటనే వీటిని పంపిణీ చేయాలని ఇరుగ్రామాల్లో డిమాండ్ చేస్తున్న పరిస్థితి ఉంది.

తామే లబ్ధిదారులమని తాళాలను పగులగొట్టి ప్రవేశాలు

గతంలో గుర్తించిన అర్హులకు కాకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేరే వారికి వీటిని కేటాయిస్తారని అందుకే వీటిని పంపిణీ చేయడం లేదని వదంతులు ఇటీవల జోరందుకున్నాయి. దీంతో మండలంలోని పెద్దమల్లారెడ్డి, బస్వాపూర్‌లో ఉన్న గబుల్ బెడ్‌రూం ఇళ్లలో గతంలో గ్రామసభల్లో గుర్తించిన అర్హులే కాకుండా మిగతా వారు సైతం పలు గ్రామాల్లో ఏది ఖాళీ ఉంటే ఆ గది తాళం పగులగొట్టి ఇప్పటికీ రెండు స్వాధీనం చేసుకుని పాలు పొంగించుకుని పూజలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఏకంగా పెద్దమల్లారెడ్డిలో గదులకు పేర్లను రాసుకున్నారు. దీంతో గతంలో అధికారులు గుర్తించిన వారికి, గదులను స్వాధీనం చేసుకున్న మిగితా వారికి తీవ్ర వాగ్వాదం, గొడవలు చోటు చేసుకుంటున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నవైనం

పూర్తి అయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఎలాంటి కాపలా ఉండకపోవడం, సాయంత్రం అయ్యిందంటే అటువైపు ప్రజలు వెళ్లకపోవడంతో పలువురు వాటిని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మార్చుకుంటున్నారు.

రామేశ్వర్‌పల్లిలో, పెద్దమల్లారెడ్డిలో కొన్నింటిలో ప్రవేశాలు

రామేశ్వర్‌పల్లి, పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో అధికారులు అధికారికంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయకున్నా ఆయా గ్రామాల్లోని కొన్ని గదుల్లో కొందరు ప్రవేశం చేసి నివాసం ఉంటున్నారు. రామేశ్వర్‌పల్లిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ వాటిని ఏ మాత్రం లెక్క చేయకుండా వాటిల్లోనే ఉంటున్నారు.

వసతి గృహాన్ని పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి

ఇందల్వాయి, ఆగస్టు 28: ఇందల్వాయి మండల కేంద్రంలోని బాలుర వసతిగృహాన్ని బుధవారం జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ పరిశీలించారు. ఆయన అధికారులతో మాట్లాడుతూ పారిశుధ్య పనుల పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. ఇటీవల సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, తదితర వ్యాధులు గ్రామాల్లో ఎక్కువ అవుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపిడివో అనంత్‌రావు, ఎంపివో రాజ్‌కాంత్, పంచాయతీ కార్యదర్శి భరత్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ జితేందర్, తదితరులు ఉన్నారు.

సైనిక్ క్యాంపునకు గిరిరాజ్ విద్యార్థి

నిజామాబాద్‌అర్బన్, ఆగస్టు 28: ఎన్‌సీసీలో అత్యంత ప్రతిష్టాత్మకమైన తల్ సైనిక్ క్యాంప్‌కు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బండు నాయక్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం గిరిరాజ్ కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న బండు నాయక్ ఈయేడాది నిర్వహించే తల్ సైనిక్ క్యాంప్‌కు మన జిల్లా నుంచి ఒక్కడే ఎంపికయ్యాడు.

'పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి'

బోధన్‌రూరల్, ఆగస్టు 28: పాత పింఛన్ విధానంను ప్రభుత్వం పునరుద్ధరణ చేయాలని టీచర్స్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సలీం అన్నారు. బుధవారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇష్టం లేని ఏకీకృత పింఛన్ విధానాన్ని స్టేట్ యూనియన్ వ్యతిరేకిస్తుందని, కావున పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిషోర్‌లతో నాయకులు బాలచంద్రం, జిల్లా కార్యవర్గ సభ్యులు వై.శ్రీనివాస్ రావు, యుసుఫ్, ప్రసాద్, శ్రీనివాస్, వహీద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన

ఎడపల్లి, ఆగస్టు 28: మండలంలోని సాటాపూర్ గేటు వద్ద బుధవారం ఎడపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ప్రజలకు సైబర్‌నేరాలపై, హెల్మెట్‌ధారణపై ఏఎస్సై ఇలియాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఫోన్‌లో గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలను ఇతరులకు చెప్పవద్దని, పోలీస్ అధికారుల డీపీతో ఫోన్‌చేసి మీ కుటుంబం వారు వివిధ నేరాల్లో ఉన్నారని చెప్పి డబ్బులు కట్టమని సైబర్ నేరగాళ్ళు కొత్త అవతారం ఎత్తారని ఆయన తెలిపారు. పోలీసులు ఎవరు కూడా డబ్బులు డిమాండ్ చేయరని, అలాంటి కాల్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. రోడ్డుప్రమాదంలో అధికంగా తలపగిలి చనిపోతున్నారని, అలా జరుగకుండా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. హెల్మెట్ లేకుండా ఎవరైనా బండి నడిపితే 5 రోజుల వరకు బండి సీజ్ చేయబడుతుందని, ఆ తరువాత ఆర్టీవో కార్యాలయంలో ఫైన్‌కట్టిన తరువాత బండి ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు. కావున ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పోలీస్ కానిస్టేబుళ్ళు తదితరులు ఉన్నారు.

రైతుల ఇంటికే వెళ్లి కుటుంబసభ్యుల నిర్ధారణ చేస్తాం

● మండల వ్యవసాయ అధికారి సిద్దిరామేశ్వర్

ఎడపల్లి, ఆగస్టు 28: కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉండి రుణమాఫీ కాని రైతుల జాబితా ప్రకారం ఆయ గ్రామాలలో వారి ఇంటికి వెళ్ళి పరిశీలించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి, రుణమాఫీ నోడల్ అధికారి సిద్ది రామేశ్వర్ తెలిపారు. తేది 28, 29న ఠానాకలాన్, 30, 31న జైతాపూర్, సెప్టెంబర్ 2, 3న ఎడపల్లి, 4న మంగల్‌పాడ్, 5న కుర్నాపల్లి, 6న బ్రాహ్మణ్‌పల్లి గ్రామాలలో రైతుల ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేస్తామని తెలిపారు. అలాగే 7న గ్రామం విడిచి వెళ్ళిన రైతులు, 8, 9న మండల బయటి గ్రామాల రైతుల కుటుంబ వివరాలను పరిశీలించి నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందన్నారు. రైతులు ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

'అమరవీరుల పోరాట స్ఫూర్తితో పోరాడుదాం'

బోధన్‌రూరల్, ఆగస్టు 28: విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం పోరాడుదామని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు మల్లేష్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని తట్టికోటలో 2000 సంవత్సరంలో విద్యుత్ ఉద్యమంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిల సంతాప సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే పోరాట స్ఫూర్తితో నేడు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల అమలుకై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు పడాల శంకర్, సాయిలు, పోశెట్టి, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు నాగమణి, కవిత, అరుణ, లక్ష్మి, వెంకటమ్మ, రాము, రాజు, శ్రీనివాస్, గంగాధర్, నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దబజార్ : పోరాట స్ఫూర్తితో ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ భారాలు మోపడానికి వెనుకడుగు వేయడం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ సమావేశం నిర్వహించి విద్యుత్ పోరాట అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పోరాటం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విఘ్నేష్ పాల్గొన్నారు.

నవీపేటలో వేంకటేశ్వర స్వామి పల్లకీ సేవ

నవీపేట, ఆగస్టు 28 : మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్ల పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర ఆలయం నుంచి హనుమాన్ మందిరం వరకు దేవతమూర్తులను పల్లకిలో ఊరేగించారు. ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి మరుసటి రోజున దేవతమూర్తులకు పల్లకిసేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

పెళ్లి భోజనంలో 'ముక్కల' లొల్లి!

● మటన్ ముక్కలు తక్కువగా వచ్చాయని వరుడి బంధువుల గొడవ
● పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులు ● 8మందికి గాయాలు



ఇరుపక్షాల దాడిలో గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నవీపేట, ఆగస్టు 28 : అప్పటి వరకు ఆ వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. వధూవరులను పెళ్లికి వచ్చిన అతిథులు నిండు మనస్సుతో ఆశీర్వదించారు. ఇప్పటివరకు బాగానే ఉన్నా.. ఆ తర్వాత మొదలైంది 'ముక్కల' లొల్లి. భోజనంలో మటన్ ముక్కలు తక్కువ వచ్చాయంటూ జరిగిన గొడవలో ఇరు పక్షాలకు చెందిన ఎనిమిది మందికి గాయాలైన ఘటన నిజామాబాద్ జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..

జిల్లాలోని నవీపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల కేంద్రానికి చెందిన వధువుకు నందిపేట మండలంలోని బాద్గుణకు చెందిన వరుడితో పెళ్లి జరిగింది. తర్వాత జరిగిన పెళ్లి భోజనంలో తమకు మటన్, చికెన్ సరిగ్గా వడ్డించడం లేదని వరుడి తరుపు బంధువులు గొడవకు దిగారు. ముక్కలు తక్కువగా వేస్తున్నారంటూ పెళ్లికూతురు తరపు బంధువులతో వాదనకు దిగారు. చిన్నగా మొదలైన గొడవ కాస్త ఒక్కసారిగా పెద్దగా మారింది. దీంతో అటు వధువు, ఇటు వరుడు తరపునకు చెందిన వారు ఒకరినొకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. అంతటితో ఆగకుండా కర్రలు, రాళ్లతో పరస్పరం దాడులకు దిగారు. ఈ ఘటనలో ఇరు పక్షాలకు చెందిన 8మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని మొదట నవీపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా.. ఫంక్షన్‌హాల్ బయట ఉన్న రోడ్డుపై సైతం ఇరు పక్షాలు దాడులు చేసుకుని న్యూసెన్స్ చేయడంతో అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రాజేష్ ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలకు చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేయాలి



నవీపేటలో తడగామ వద్ద రోడ్డుపై గుంత పడిన దృశ్యం

నవీపేట,ఆగస్టు28: నవీపేటలోని తడగామ చౌరస్తా వద్ద ప్రధాన రహదారి మధ్యలో భారీ గుంత ఏర్పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంత పెద్దదిగా మారగా వర్షపు నీరు గుంతలో నిలిచి పలుమార్లు ద్విచక్ర వాహనదారులు ప్రమాదం బారిన పడ్డారని స్థానికులు పేర్కొన్నారు. నవీపేట నుంచి నందిపేటకు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయని వెంటనే సంబంధిత గుంతను పూడ్చివేసి ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలో కొందరు కర్రను పాతి దానికి ప్లాస్టిక్ కవర్‌ను చుట్టారు. వెంటనే ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడ్డ గుంతను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య లోపం : యార్లగడ్డ

రుద్రూరు, ఆగస్టు 28 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పారిశుధ్యం పేరుకు పోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆర్ఎస్‌పీ పార్టీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కార్యదర్శి యార్లగడ్డ సాయిబాబా పేర్కొన్నారు. బుధవారం రుద్రూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో జిల్లాస్థాయి అధి కారులు గ్రామాల్లో పర్యటించడం లేదన్నారు. గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో నెల కొన సమస్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బోధన్ డివిజన్ కార్యదర్శి బాలు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

రుద్రూరు, ఆగస్టు 28 : ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ రుద్రూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాండ్ల మధు, నీరడి నడిపి సాయిలు, సాయి కిరణ్, షేక్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై నేటి నుంచి ఇంటింటా సర్వే

వేల్పూర్, ఆగస్టు28: వేల్పూర్ మండల గ్రామాల్లో రైతులకు పంట రుణమాఫీ వర్తించకపోవడంతో గురువారం రైతుల ఇంటింటికి వెళ్లి సర్వే చేపడుతున్నట్టు మండల వ్యవసాయాధికారి శృతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డు లేకుండా రుణమాఫీ రాని కుటుంబాలను మొబైల్ యాప్‌లో గ్రూపింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 29న తేదీన మోతె గ్రామం, 30న వెంకటాపూర్, కుకునూర్, కోమన్‌పల్లి, 31న వేల్పూర్, సెప్టెంబర్ 2న జాన్కంపేట్, సాహెబ్‌పేట్, 3న అక్లూర్, 4న రామన్నపేట్, 5న అంక్సాపూర్, 6న కొత్తపల్లి, వాడి, 9నపచ్చలనడ్కుడ, 10న పడిగెల, పోచంపల్లి, 11నఅమీనాపూర్,లక్కోర గ్రామాల్లోజరుగుతుందని ఏవో తెలిపారు

రైతు భరోసా యాప్‌ను నమోదు చేసుకోవాలి

ముప్కాల్, ఆగస్టు28: రుణమాఫీ పథకంలో భాగంగా ఇప్పటి వరకు రుణమాఫీ కానీ రైతులు రైతు భరోసా యాప్ ద్వారా వ్యవసాయ శాఖ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బాల్కొండ వ్యవసాయాధికారి లావణ్య తెలిపారు. అయితే ఈ పథకం కింద రుణమాఫీ కానీ రైతులు తమ కుటుంబసభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉంటుందని, అందులో భాగంగా రైతు ఇంటికి వెళ్ళి కుటుంబసభ్యుల పూర్తి వివరాలు రైతు భరోసా యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, అనంతరం దరఖాస్తుదారు నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రామంలో వ్యవసాయాధికారులకు సహకరించి రుణమాఫీ కానీ రైతులు దరఖాస్తు చేసుకోవాన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

మోర్తాడ్, ఆగస్టు28: మండలంలోని దర్మోరా గ్రామానికి చెందిన కనూరు లక్ష్మీ(42) అనే మహిళ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుందని ఎస్సై విక్రం తెలిపారు. మృతురాలు ఈనెల 4న ఇంటి నుంచి వెళ్ళి ధర్మోరా శివారులోని చిన్నవాగులో దూకి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. బుధవారం ఉదయం ఆమె శవంచిన్నాపూర్ బ్రిడ్జి వద్ద తేలిందని గ్రామస్థులు మృతురాలి లక్ష్మీ అని గుర్తించారు. ఆమె కూతురు సంజుశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై సమావేశం

ఏర్గట్ల,ఆగస్టు 28:మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు ఎలేటి నారాయణరెడ్డి అధ్యక్షతన మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్కన్నగారి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు పలు సలహాలు, సూచనలు తెలిపారు. ప్రతీ ఒక్కరు పార్టీ కోసం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండ ఘనశ్యామ్, గడ్డం శ్రీనివాస్, గుండల విఠల్, ఆనందం గంగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనాలు అందించాలి

● జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్

కమ్మర్‌పల్లి,ఆగస్టు28:విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనాలు అందించాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్‌కుమార్ సూచించారు. బుధవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. వంటశాలవద్ద పరిశుభ్రత పాటించాలని, రుచి, సూచకరమైన భోజనాలను విద్యార్థులకు అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థుల భోజనాల విషయంలో ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను, ఇటీవల పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. తరగత గదుల్లో విద్యార్థులతో ముచ్చటిస్తూ, విద్యాబోధన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన సరుకుల స్టాక్‌రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న డిజిటల్ తరగతుల నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి ఆంధ్రయ్య, పాఠశాల హెచ్ ఎం పసుపుల సాయన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

● హసాకొత్తూర్ పాలీహౌజ్‌లో ఆర్కిడ్ పూలతోట పరిశీలన

మండంలోని హసాకొత్తూర్ గ్రామశివారులోల మారుతీనగర్ కాలనీలో పాలీహౌజ్‌లో నిర్వహిస్తున్న ఆర్కిడ్ పూలతోటను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్ పరిశీలించారు.ఈసందర్భంగా పూలతోట నిర్వాహకుడు మోహన్ నాయక్ ద్వారా ఆర్కిడ్ పూలతోట పెంపకంలోగల సస్యరక్షణ విధానాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పూల మార్కెటింగ్, మార్కెటింగ్‌లోగల సమస్యలు,పరిష్కార మార్గాలను తెలుసుకున్నారు.కాగా గ్రామంలో రైతులు పండిస్తున్న పంటలు,మార్కెటింగ్ తదితర సమస్యలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉద్యానవన శాఖ అధికారి రాజు, రైతులు పడిగెల ప్రవీన్, ఏనుగు మనోహర్,మేడపురమేష్, కిషన్ గౌడ్, తదితర రైతులు ఉన్నారు.

దివ్యాంగులకు నెలకు రూ.6వేల పింఛన్ వెంటనే చెల్లించాలి

● వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ



నవీపేటలో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత

నవీపేట,ఆగస్టు28: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు నెలకు 6వేల రూపాయల పింఛన్‌ను వెంటనే చెల్లించాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అక్కడి తెలుగు దేశం ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు నెలకు 6వేల రూపాయల పింఛన్ చెల్లిస్తుండగా, వృద్ధులు, వితంతువులకు నెలకు 4వేల రూపాయల చొప్పున చెల్లిస్తుందని ఇదే విధానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం వెంటనే అమలు చేయాలని ఆమె కోరారు. అలాగే దివ్యాంగులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించడంతో పాటు బ్లాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రాబోయే ఎన్నికలలో దివ్యాంగులకు సైతం రిజర్వేషన్ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. అంతకు ముందు వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మానికొళ్ల గంగాధర్, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షులు బయ్యా సతీష్ కుమార్, విజయ్ కుమార్, పంతులు, రాము, వెంకట్, షంషోద్దీన్, లక్ష్మి, శోభ, సాయమ్మ తదితరులున్నారు.

పాడి పశువుల పెంపకంపై శిక్షణ



మాట్లాడుతున్న వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బస్వారెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు28: ఆర్మూర్ పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం మహిళశక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాగ్రామాభివృద్ధి సంస్థ, జిల్లా పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో పాడి పశువుల పెంపకం దారులకు, పౌల్ట్రీ యూనిట్ లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వెటర్నరి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బస్వారెడ్డి మా ట్లాడుతూ ఐకేపీ ఆధ్వర్యంలో శ్రీనిధి పథకంలో రుణాలు తీసుకొని పాడి గేదేలు కొనుగోలు చేసి జీవనోపాధి పొందే లబ్ధిదారులు పాడి పశువుల పెంపకంలో మేళకువలు తెలుసుకోవాలన్నారు. పాడి పశువులను కొనుగోలు చేసే సమ యంలో అధిక పాల దిగుబడిని ఇచ్చే మొర్ర జాతి గేదేలను కొనుగోలు చేస్తే పాల దిగుబడి ఎక్కువగా వచ్చి లాభాలు పొందవచ్చన్నారు. పాడి గేదేల్లో సం క్రమించే వ్యాధులు, నివారణ టీకాలపై అవగాహన కల్పించారు. ఆవులు, పాడి గేదేలు, పెరటి కోళ్ల పెంపకందారులు సరైన జాగ్రత్తలు పాటించి మెరుగైన లాభాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్‌ప్రభాకర్, ఐకేపీ ఏపీఎం, ఐకేపీసిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మోపెడ్ వాహనం లభ్యం



నవీపేటలో లభ్యమైన మోపెడ్ వాహనం

నవీపేట,ఆగస్టు28: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వెనుక వైపున ఎక్సెల్ సూపర్ వాహనం బుధవారం లభ్యమైంది. వాహనం గత రెండు మాసాలుగా బస్టాండ్ ఆవరణలో నిలిపి ఉందని స్థానికులు పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఎవరు కూడా రాకపోవడంతో సంబంధిత సమాచారాన్ని పోలీసులకు అందజేయడం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. గుర్తు తెలియని దొంగలు వాహనం చోరీ చేసి పెట్రోల్ అయిపోవడంతో బస్టాండ్ ప్రాంతంలో వదిలేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

ఆర్మూర్‌లో కుక్కల దాడి.. పలువురికి గాయాలు

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు28:మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో కుక్కలు దాడులు చేయగా పలువురికి గాయాలయ్యాయి. పట్టణంతో పాటు మామి డిపల్లి, పెర్కిట్‌లలో కుక్కల అదికంగా ఉండడంతో పిల్లలు పెద్దలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు పట్టణంలో ఆరేళ్ళ బాలికకు చేతిపై కుక్క దాడి చేసింది. మామిడిపల్లిలో పలువురికి కుక్క దాడి చేయి గాయపర్చింది. అధికా రులు మున్సిపల్ పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



హైదరాబాద్ విమానాశ్రయం నుంచి అంబులెన్స్‌లో తరలివస్తున్న మృతదేహం

మెండోర, ఆగస్టు28: మండలంలోని చాకిర్యాల్ గ్రామానికి చెందిన మండెజీ రాజేశ్వర్ ఐదు రోజుల క్రితం గల్ఫ్ దేశం దుబాయిలో మృతి చెందడంతో మృతుని మృతదేహం స్వగ్రామానికి చేరింది. ఈ సందర్భంగా దుబాయిలో రాజేశ్వర్ మృతి చెందిన విషయాన్ని మృతుని కుటుంబసభ్యులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్ళగా దుబాయి ఇండియా ఎంబాసి అధికారులతో మాట్లాడి మృతదేహం స్వదేశానికి రావడానికి కృషి చేశారు. మృతదేహం విమానాశ్రయం నుంచి గ్రామానికి రావడానికి ప్రభుత్వం తరపున అంబులెన్స్ ఏర్పాటు చేశారు. పొట్టకూటి కోసం దేశం కానీ దేశం వెళ్ళి ఇలా విగత జీవిగా వస్తారని అనుకోలేదని కుటుంబసభ్యులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి కుటుంబసభ్యులకు సునీల్‌కుమార్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మోర్తాడ్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

మోర్తాడ్, ఆగస్టు28: మోర్తాడ్ మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం సాయంత్రం మోర్తాడ్ మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయంలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్టికొట్టేందుకు పాల్గొన్న యువకులు విఫలమయ్యారు. చివరకు ఒకరిపై ఒకరు ఎక్కి ఉట్టికొట్టారు. దీంతో గ్రామస్థులు హర్షధ్వానాలతో మార్మోగాయి. ఈ సందర్భంగా ఉట్టికొట్టిన యువకులకు బహుమతులు అందజేశారు.

● తొర్లికొండ, అర్గుల్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



మోర్తాడ్‌లో ఉట్టికొడుతున్న దృశ్యం

జక్రాన్‌పల్లి:మండలంలోని అర్గుల్, తొర్లికొండ గ్రామాల్లో బుధవారం శ్రీకృ ష్ణాష్టమి వేడుకలను ఇరు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.అర్గుల్‌లో ఉట్టికొట్టి ఆనందోత్సవాల మధ్య కృష్ణాష్టమి వేడుకలు జరు పుకోగా తొరికొండలో కృష్ణాష్టమి వేడుకలను అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్గుల్ వీడీసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, క్యాషియర్ అల్లూరి భాస్కర్‌రెడ్డి, వీడీసీసభ్యులు, తొర్లికొండ ఆలయ కమిటీసభ్యులు, వీడీసీ సభ్యులు, ఇరు గ్రామస్థులు పాల్గొన్నారు.

తాళ్లరాంపూర్ సొసైటీలో పంట రుణాల పంపిణీ



పంట రుణాలను అందజేస్తున్న చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి

ఏర్గట్ల, ఆగస్టు 28: మండలంలోని తాళ్లరాంపూర్ సొసైటీలో బుధవారం 52 మంది రైతులకు 49లక్షల 75వేలు పంట రుణాలను సంఘం చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇట్టి రుణాలకు సహకరించిన జిల్లా బ్యాంక్ అధ్యక్షుడు కుంట రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా రుణాల కోసం సరియైన పత్రాలు అందజేసి సొసైటీలో రుణాలు పొందాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్‌లు, కార్యదర్శి గణేష్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రజలు నడిచేది ఎలా!?



గుంతలు పడ్డ ముచ్కూర్, భీమ్‌గల్‌కు వెళ్లే ప్రధాన రహదారి

భీమ్‌గల్, ఆగస్టు28: భీమ్‌గల్ పట్టణం నుంచి ముచ్కూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిని అనుకుని ఉన్నబడాభీమ్‌గల్ బైపాస్‌రోడ్డు ప్రథ మంలో గుంతల మయమైన నీరు నిలిచి చిన్న కుంటను తలపిస్తుంది. దుర్గంధ భరితంగా మారింది. దీంతో ప్రతినిత్యం ఈ రోడ్డుగుండా నడిచే వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ఆ గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గం గుండా తిరిగి ప్రజాప్రతినిధులు ఈ సమస్యకు మార్గం చూపలేకపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు గానీ, మున్సిపల్ సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదు. మున్సిపల్ సిబ్బంది కూడా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎయిర్‌పోర్టుకు చేరుకున్న జాగృతి నాయకులు



ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలకడానికి వెళ్లిన జాగృతి నాయకులు

సిరికొండ ఆగస్టు 28: ఎమ్మెల్సీ భారత్ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జైలు నుంచి విడుదల హైదారాబాద్ వస్తునందున స్వాగతం తెలుపడానికి జాగృతి నాయకులు హైదరాబాద్ ఏర్‌పోర్టుకు వెళ్లారు. నిజామాబాద్ రూరల్ నియోజక వర్గం కన్వీనర్ మల్లెల సాయి చరణ్ ఆధ్వర్యంలో జాగృతి నాయకులు వెళ్లారు.

డిచ్‌పల్లి: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిన వచ్చి బుధవారం హైదరా బాద్ రావడంతో ఆమెకు స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ రూరల్ నాయకుడు బాజి రెడ్డి జగన్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈకార్యక్రమంలో కృష్ణకుంచల రాజు, పద్మరావు, సంబారి మోహన్, సాయిచరన్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికేందుకు బుధవారం బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని వెళ్ళారు. అనంతరం ఎమ్మెల్సీ కవితను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బీఆర్ఎస్ నాయకులు కలిసి స్వాగతం పలికారు. మండలంలోని సికింద్రాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. తరలివెళ్ళిన వారిలో మాజీఎంపీపీ కుంచాల విమల రాజు, మాజీ వైస్‌ఎంపీపీ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అరుణ్‌కుమార్, కార్యకర్తలు ఉన్నారు.

బాల్కొండ పీఆర్టీయూ అధ్యక్షుడిగా శ్రీనివాస్

ముప్కాల్, ఆగస్టు28: బాల్కొండ మండలంలో పీఆర్‌టీయు సమావేశంలో అధ్యక్షుడిగా వేల్పూర్ శ్రీనివాస్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శి గడ్డం ప్రతాప్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా గోపి, కార్యదర్శిగా రాజేశ్వర్, మహిళ ఉపాధ్యక్షురాలిగా విద్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా పీఆర్‌టీయు అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై అందరిని కలుపుకొని పోరాడుతామని తెలిపారు.

బ్యాంకు రుణాలు, వసూళ్లపై అవగాహన

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 28:నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన వివిధ బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లకు డ్వాక్రా సంఘాల బ్యాంకు రుణాలు, వసూళ్లపై, మహిళా శక్తి కార్యక్రమంపై బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో సాయాగౌడ్ వారికి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో నేషనల్ రిసోర్స్ పర్సన్ రమేష్, ప్రాజెక్టు మేనేజర్ సెర్ప్ వీరమల్లు, వెంకట్, అశోక్ చౌహాన్, మురళీకృష్ణ, రవీందర్, నీలిమా తదితరులు పాల్గొన్నారు.

జీవో జారీ.. నిధులేవి మరి!?



హంగర్గ ఫారంలోని ప్రభుత్వ పాఠశాల

కోటగిరి,ఆగస్టు28: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు స్కూల్ ఫెసిలిటి మెంటినెన్స్ పేరుతో ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నట్లు విద్యాశాఖ గత నెల 30వ తేదిన జీవో విడుదల చేసింది. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా విడుదలయ్యే కంపోజిట్ స్కూల్ గ్రాంట్‌కు అదనంగా ఈ నిధులను అందజేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇంత వరకు బాగానే ఉన్న ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలు వేలాది సంఖ్యలో ఉండగా లక్షలాది మంది విద్యార్థులు పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులే అటెండర్‌లుగా మారిన సందర్భాలు ఉన్నాయి. స్కావెంజర్‌లను గత ప్రభుత్వం తొలగించి పారిశుధ్య బాధ్యతలను పంచాయతీలకు అప్పగించింది. ఆ ప్రక్రియ ఎక్కడ సరిగా అమలు కాలేదు. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ఖాతాలో మూడు నెలల నిధులను ముందే జమ చేయబోతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ విషయమై ఇప్పటి వరకు ప్రభుత్వం ముందడుగు వేయలేదు. ఈ జీవో వచ్చిన వెంటనే పంచాయతీల పారిశుధ్య సిబ్బంది పాఠశాలల్లో పారిశుధ్య సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా చేతులు ఎత్తేశారు. నిధులు లేకపోవడంతో విద్యార్థులే తరగతుల శుభ్రత వంటి పనులు చేపట్టాల్సి వస్తుంది. ప్రభుత్వ ప్రకటనలతో కొన్ని పాఠశాలల్లో స్కావెంజర్‌లను నియమించారు. వారికి వేతనాలు ఇవ్వాలంటే ఉపాధ్యాయులే భరించాల్సిన పరిస్థితి నెలకొంది. అమ్మ ఆదర్శ కమిటీలు నిధులు మంజూరైన తర్వాతే స్కావెంజర్‌లకు వేతనాలు చెల్లిస్తామని ఓ వైపు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై కోటగిరి ఎంఈవో నాగనాథ్‌ను వివరణ కోరగా పలు పాఠశాలల్లో స్కావెంజర్‌లను ఏర్పాటు చేశామన్నారు. నిధులు వచ్చిన వెంటనే వారికి వేతనాలు చెల్లిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

● మరొకరికి తీవ్రగాయాలు ● నిలిపి ఉన్న లారీని ఢీకొన్న కారు ● మద్యం మత్తు, అతివేగమే కారణం



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 28:నగర శివారులో తెల్లవారుజామున జరిగిన ఓ రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకులను బలి తీసుకుంది. నిజామాబాద్ రూరల్ మండలం శ్రీనగర్ వద్ద బుధవారం ఉదయం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు సంఘటన స్థలంలోనే మృతి చెందగా మరొక యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. సారంగపూర్ నుంచి పాల్దా-జన్నెపల్లికి వెళ్లే రహదారిపై గజానన్ రైస్‌మిల్ వద్ద గత రెండు రోజులుగా రోడ్డుపై గుంతలో దిగబడిన లారీ అక్కడే ఉండటంతో నిజామాబాద్ దుబ్బ నుంచి చిక్లీ వెళ్తున్న షిఫ్ట్ డిజైర్ కారు అతివేగంగా లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు టాప్ మొత్తం ఎగిరిపోయి కారులో ఉన్న ఇద్దరు యువకులు మాక్లూర్ మండలం చిక్లీ గ్రామానికి చెందిన దండ్ల వంశీ (17), నగరంలోని కుమార్‌గల్లిలో ఉంటున్న రాజేష్ (18) సంఘటన స్థలంలోనే మృతి చెందారు. కారు నడుపుతున్న దుబ్బకు చెందిన ఆకాష్‌కు తీవ్ర గాయాలు కావడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నగరంలోని దుబ్బకు చెందిన ఆకాష్ నగరంలోని ఓ హోటల్‌లో పనిచేస్తుండగా గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఇంటిదగ్గరే ఉండటంతో స్నేహితులు వంశీ, రాజేష్‌లు బయటకు వెళ్దామని తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. వంశీని చిక్లీలో దింపేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై నిజామాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత రెండు రోజులుగా గజానన్ రైస్‌మిల్ వద్ద రోడ్డుపై లారీని నిలిపి ఉంచడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆందోళన నిర్వహించారు. యువకుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని స్థానికులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వచ్చి వారిని సముదాయించడంతో కొద్దిసేపు పోలీసులకు వారికి వాగ్వివాదం జరిగింది. మితిమీరిన వేగం, యువకులు మద్యం మత్తులో ఉండటం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. కారు టాప్ పూర్తిగా ఎగిరిపోగా ఇంజన్‌తో సహా కారు మొత్తం నుజ్జు నుజ్జు కావడం ప్రమాద తీవ్రతను తెలియజేస్తుంది. సౌత్ రూరల్ సీఐ సురేష్, రూరల్ ఎస్సై ఆరిఫ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను కారులోంచి బయటకు తీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇద్దరి యువకుల ప్రాణాలను బలితీసుకున్న లారీ డ్రైవర్, రైస్‌మిల్ ఓనర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ డిమాండ్ చేశారు.

కామారెడ్డిలో వడ్డీ వ్యాపారిపై దాడి

● చికిత్స పొందుతూ వ్యాపారి మృతి ● పరారీలో నిందితులు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 28: కామారెడ్డి పట్టణంలో వడ్డీ వ్యాపారం చేసుకునే పాత విశ్వనాథం(64)పై కొందరు మారణాయుధాలతో దాడి చేయడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివాసం ఉండే విశ్వనాథం పట్టణంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో డబ్బులను వడ్డీకి ఇస్తూ వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే కామారెడ్డి పట్టణానికి చెందిన లక్ష్మీభాయి అనే మహిళకు గతంలో రూ.32లక్షల వరకు వడ్డీకి విశ్వనాథం అప్పుగా ఇచ్చాడు. ఇటీవల సదరు మహిళ వడ్డీ డబ్బులు కట్టాలంటూ విశ్వనాథం ఇబ్బంది పెడుతున్నాడని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇదేక్రమంలో విశ్వనాథంపై కక్షకట్టిన ఆమె మరికొందరితో కలిసి దాడి చేసేందుకు పన్నాగం పన్నినట్లు తెలిసింది. మంగళవారం ఉదయం విశ్వనాథం నివాసం ఉండే విద్యానగర్ కాలనీలోని శివాలయానికి వచ్చాడు. దీంతో అతని రాకను గమనించిన


విశ్వనాథం (ఫైల్)

లక్ష్మీభాయితో పాటు మరికొంత మంది కలిసి అడ్డగించి డబ్బుల విషయమై గొడవ పడి పిడిగుద్దులు గుద్ది, మారణాయుధాలతో దాడిచేసి వారు వచ్చిన కారులో ఎక్కించుకుని పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో చుట్టుపక్కల వారు అడ్డగించగా వారు అక్కడి నుంచి పారిపోయారు. గాయాలపాలైన విశ్వనాథంను కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబీకులు అతడిని హైదరాబాద్‌లో ఉన్న యశోద ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ విశ్వనాథం బుధవారం మృతి చెందాడు. మృతుడి బావమరిది రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మీభాయితో పాటు మరికొందరిపై హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం నిందితులందరు పరారీలో ఉన్నారని వారిని త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు.

విద్యుత్ షాక్‌తో చిరుత మృతి

● పూడ్చి పెట్టిన రైతు ● వెలికి తీసిన అధికారులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 28 : విద్యుత్ షాక్‌తో చిరుత మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని కట్టకింద తండా శివారులో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కట్టకింద తండాకు చెందిన ఓ రైతు అడవి పందుల బెడద నివారణ కోసం మంగళవారం రాత్రి పంట చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. అయితే ఈ విద్యుత్ తీగలకు తగిలి పులి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. బుధవారం ఉదయం పులి చనిపోవడాన్ని చూసిన సదరు రైతు భయంతో వెంటనే గుంత తీసి పులి కళేబరాన్ని పూడ్చి పెట్టాడు. దీన్ని చూసిన తోటి రైతులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి గుంతని తవ్వి తీయగా చిరుత పులి కళేబరం లభ్యమైంది. అనంతరం అధికారులు ఎల్లారెడ్డి రేంజ్ కార్యాలయానికి చిరుత పులి


మృతి చెందిన చిరుత పులి కళేబరం

కళేబరాన్ని తీసుకెళ్లి వెటర్నరీ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత వయస్సు రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. అలాగే చిరుత పులికి ఉన్న గోర్లు, దంతాలు సేకరించినట్లు డీఎఫ్‌వో రామకృష్ణ తెలిపారు. పంట పొలానికి విద్యుత్ తీగలు అమర్చిన రైతుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు డీఎఫ్‌వో తెలిపారు.

'ఇంటింటి సర్వే'ను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మద్నూర్, ఆగస్టు 28: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వేను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మద్నూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం స్వయంగా పరిశీలించారు. సంబంధిత బూత్ లెవల్ అధికారులతో సర్వే యొక్క తీరును అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటరుగా నమోదు చేయాలని దరఖాస్తులు తీసుకోవాలని అన్నారు. అదే విధంగా ప్రతీ ఇంటిలో కుటుంబ సభ్యుల పరిశీలన, ఇంట్లో ఉంటున్నది లేనిది, ఇతర ప్రాంతానికి వెళ్లింది వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఆధార్ సేకరించని వారి ఓటరు గుర్తింపునకు ఆధార్ సీడింగ్ చేయాలని అన్నారు. మరణించిన వారి ఓటును తొలగించడానికి మరణ ధ్రువీకరణ పత్రం జత చేయాలని జాగ్రత్తగా తొలగించే కార్యక్రమ విధానం ప్రకారం చేయాలని తెలిపారు.


మద్నూర్‌లో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఇంటింటి సర్వే జరుగుతున్నట్లు తెలియజేశారు. అదనపు కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ ఎం.డి.ముజీబ్, మండల ఎంపీడీవో రాణి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, బీఎల్‌వో, సూపర్ వైజర్, రవికుమార్, బీఎల్‌వో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 28: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు అన్నారు. బుధవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలపడంతో పాటు సీఎస్ఐ గ్రౌండ్ నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు శాంతియుత మహార్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ ధర్నా సభలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో హాజరైన రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే రెగ్యులరైజ్ చేస్తామని, బేసిక్ పే అమలు చేస్తామని అన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడడంతో పాటు ఆయన సీఎంగా ఉన్నా తాత్సారం చేస్తున్నారని, ఇది ప్రజాప్రభుత్వం అని చెప్పి మమ్మల్ని మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. వెంటనే సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఆ లోపు ఎంటీఎస్ అమలు చేయాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, మరణించిన వారికి 20లక్షల ఎక్స్‌గ్రేషియా, విద్యాశాఖ నియామకాల్లో 30 శాతం వెయిటేజ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు యోగి, భాను, రాములు, కళ్యాణ్, శైలజ, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు బాణాల లక్ష్మారెడ్డి


నాగిరెడ్డిపేటలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న బాణాల లక్ష్మారెడ్డి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 28: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రతీ ఒక్క కార్యకర్త సైనికుల్లా పని చేసి, లక్ష్యాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర బీజేపీ నాయకులు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రంలోని రామాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై మండల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేయాలని బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతీ గ్రామంలో, వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోది నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని, మండలంలో పది వేల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మర్రి బాపురెడ్డి, హన్మాండ్లు, మండల పార్టీ అధ్యక్షుడు సత్య బోయిన శ్రీకాంత్, నాయకులు గంపల వెంకన్న, శ్రీనివాస్, కృష్ణ, నరేందర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మెంగారం చెరువులో చేప పిల్లల విడుదల

లింగంపేట, అగస్ట్ 28 : లింగంపేట మండలంలోని మెంగారం చెరువులో బుధవారం గ్రామ మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో లక్ష10వేల చేప పిల్లలను విడుదల చేశారు. ఒక్కో చేప పిల్లను రూ.2కు కొనుగోలు చేసినట్లు గ్రామ సంఘం అధ్యక్షుడు పర్వయ్య తెలిపారు. ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వెంకటి, రాజశేఖర్, అశోక్, ప్రశాంత్, నాగరాజు, హనుమంతులతో పాటు సభ్యులు ఉన్నారు.

వరి పంట చీడపీడలపై అవగాహన

లింగంపేట, ఆగస్టు 28: మండలంలోని బాణాపూర్‌లో బుధవారం వరి పంటలో చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యంపై రైతులకు మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్‌రెడ్డి, డాక్టర్ రేవంత్‌లు అవగాహన కల్పించారు. నానో డీఏపీ, డ్రోన్ సర్వీస్‌ల గురించి రైతులకు వివరించారు. నేల ఆరోగ్యం పెంపొందించడం సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో కోరమండల్ ప్రతినిధులు పాపిరెడ్డి, రమేష్, సతీష్, మహేష్‌లతో పాటు గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.


దోమకొండలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఏఎస్సై

గడికోట ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభం

దోమకొండ, ఆగస్టు 28: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం క్రికెట్ పోటీలను ఏఎసై సుబ్రహ్మణ్యచారి, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గడికోట సీనియర్ మేనేజర్ బాబ్జి మాట్లాడుతూ 29న క్రీడా దినోత్సవం సందర్భంగా దోమకొండ కోట, గ్రామాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించడానికి మండల స్థాయి అండర్ 18, అండర్ 25 కేటగిరి వారిగా 100 మీటర్ల పరుగు పందెం, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో యువతీ యువకులకు పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, లింగం, పీసీలు కిరణ్, లోలపు సిద్ధిరాములు, నంద లింగం, యువతి, యువకులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ నాయకులకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

భిక్కనూరు, ఆగష్టు 28: మండలంలోని బస్వాపూర్ విండో ఎదుట కాంగ్రెస్ నాయకులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాచాపూర్ విండోను ప్రత్యేక విండోగా ఏర్పాటు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ ఫలితమేనని అన్నారు. ఈ మేరకు సీఎం, మంత్రి ప్రభుత్వ సలహాదారుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాగారెడ్డి, ఎల్లం, జీవన్, తుడుం స్వామి, నరేందర్‌రెడ్డి, గందం నగేష్, రాజిరెడ్డి, చందు, ప్రేమ్, మహిపాల్, దుర్గాబాబు, జగన్, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వర్‌పల్లిలో వైద్య శిబిరం

భిక్కనూరు, ఆగస్టు 28: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి హేమిమా గ్రామంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న 12 మందికి సంబంధించిన రక్త నమూనాలను సేకరించారు. ఈ మేరకు వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశామన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రకాంత్‌రెడ్డి, సూపర్‌వైజర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.


సిద్ధరామేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సిద్ధరామేశ్వర ఆలయంలో శ్రావణమాస పూజలు

భిక్కనూరు, ఆగస్టు 28: మండల కేంద్రంలోని శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో బుధవారం స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని తీరొక్కపూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. కాగా ఆలయ ప్రాంగణంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సత్యనారాయణ వ్రతాలు, పుట్టు వెంట్రుకలు, కోడె పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

దోమకొండ, ఆగస్టు 28: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై సుబ్రహ్మణ్యచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో యువతకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మత్తుకు దూరంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపిన సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. బుద్ధిగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. ఎవరైన ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకుల వారీగా రైతుల వివరాల సేకరణ

రాజంపేట, ఆగస్టు 28: రైతు రుణమాఫీ కోసం రాజంపేట మండలంలో 429 మంది రైతు కుటుంబాల వివరాలను సేకరించామని ఏవో సునితారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ లిస్టులోని రైతులు తమ ఆధార్‌కార్డు వివరాలను, తమ కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు వివరాలను సంబంధిత ఏఈవోలను సంప్రదించి మండల వ్యవసాయాధికారి వద్ద ధ్రువీకరణ పత్రంపై సంతకం చేసి తమ కుటుంబ సభ్యుల వివరాలను నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ

మద్నూర్, ఆగస్టు 28: మండల కేంద్రంలో రైతు వేదికలో రుణమాఫీ కాని రైతుల వివరాలను మండల వ్యవసాయ అధికారి రాజు వివరాలను సేకరించారు. రేషన్‌కార్డు లేని రైతులకు కుటుంబ నిర్ధారణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో వివరాలను నమోదు చేశారు. రేషన్‌కార్డు లేని రైతుల దరఖాస్తులను పరిశీలించి వాటిని యాప్ నందు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. నేటి నుంచి మద్నూర్, డోంగ్లి మండలాల్లో వ్యవసాయ అధికారి ఆయా గ్రామాల్లో పర్యటించి రేషన్‌కార్డు లేని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసి యాప్‌లో ఆన్‌లైన్ నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు అనిల్, విశాల్, సంపత్, భజన్న, గజానన్, సంరిన్, సంయుక్త, రైతులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఎల్లారెడ్డి పట్టణ కార్యదర్శిగా జాషువా

ఎల్లారెడ్డి, ఆగస్టు 28: ఎల్లారెడ్డి నగర కార్యదర్శిగా జాషువా ఎన్నికయ్యారు. అలాగే సంయుక్త కార్యదర్శిగా వెంకట్ అలాగే పట్టణ హాస్టల్స్ ఇన్‌చార్జీగా వంశీతో పాటు వివిధ బాధ్యతలతో కూడిన నగర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లుగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి పరిషత్ పూర్వ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


సిద్ధరామేశ్వర్‌నగర్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

● ఒకరి పరిస్థితి విషమం

భిక్కనూరు, ఆగస్టు 28: మండలంలోని సిద్ధరామేశ్వర్‌నగర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. చిన్నమల్లారెడ్డికి చెందిన భార్యాభర్తలు భిక్కనూరు నుంచి సిద్ధరామేశ్వర్ నగర్ వైపు వస్తుండగా భిక్కనూరు నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న బైక్ ఢీకొనడంతో రెండు బైక్‌లపై ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని జీఎంఆర్, 108 అంబులెన్స్‌లలో చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

బీర్కూర్ శివారులో శిల్పాన్ని పరిశీలించిన పరిశోధకుడు

బీర్కూర్, ఆగస్టు 28: బీర్కూర్ గ్రామ శివారులోని జోడా శివలింగాల దేవాలయం పక్కన గల ద్వంద వీరుల వీరగల్లు అరుదైన శిల్పాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు, చరిత్ర పరిశోధకుడు, బొగ్గుల శంకర్‌రెడ్డి గుర్తించాడు. బుధవారం ఆయన బీర్కూర్‌లో పర్యటించాడు. జోడు లింగాల ఆలయం పక్కన గల రాయిపై చెక్కి ఉన్న వీరగల్లు శిల్పాన్ని పరిశీలించారు. శిల్పంలో ఒక్కరు కాదు ఇద్దరు వీరులు ఉన్నారని తెలిపారు. స్మారకంగా వేసిన వీరగల్లు, శిల్పంలో కుడివైపున ఉన్నది వీరుడని గుర్తించారు.


బీర్కూర్ శివారులో శిల్పాన్ని పరిశీలిస్తున్న పరిశోధకుడు

నూతన బోర్ మోటార్ ప్రారంభం

కామారెడ్డి టౌన్, ఆగస్టు 28: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 47వ వార్డులో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బోర్ మోటార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసుస్టేషన్ పక్కన గల వీధిలో తీవ్ర నీటి ఎద్దడి ఉందని స్థానిక కౌన్సిలర్ గెరిగంటి స్వప్న తన దృష్టికి తీసుకురావడంతో బోర్ వేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు నజీరుద్దీన్, పిట్ల వేణుగోపాల్, పాత శివకృష్ణమూర్తి, పంపరి శ్రీనివాస్, పిడుగు మమత, ఎస్ఐలు శ్రీరాం, వినయ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాల నివారణకు చర్యలు

సదాశివనగర్, ఆగస్టు 28: మండలంలోని భూంపల్లిలో విష జ్వరాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారిణి ఆస్మా తెలిపారు. బుధవారం 80 మందికి పరీక్షలు నిర్వహించి 50 మంది రక్త నమూనాలు టీహబ్‌కు పంపినట్లు తెలిపారు. అత్యవసరమున్న రెండు కేసులను ఉన్నత పరీక్ష కేంద్రానికి పంపినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ సహకారంతో అధికారులతో కలిసి డ్రైనేజీ శుభ్రత దోమల లార్వా నివారణ కోసం పురుగు మందుల స్ప్రే చేయించడం జరుగుతుందన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

సదాశివనగర్, ఆగస్టు 28: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం సదాశివనగర్ మండలంలోని పద్మాజివాడి, తిమ్మాజీవాడల్లో మెంబర్‌షిప్ క్యాంపెయిన్‌తో పాటు పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మెంబర్‌షిప్ క్యాంపెయిన్‌లో రాష్ట్ర కౌన్సిలర్ నాగభూషణం, జిల్లా కార్యదర్శి లింగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రామారెడ్డిలో రాస్తారోకో


రోడ్డుపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న ప్రజలు

రామారెడ్డి, ఆగస్టు 28: మండల కేంద్రంలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో బుధవారం మండల ప్రజలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామారెడ్డి మండలంలో మిషన్ భగీరథ నీరు గత మూడు రోజుల నుంచి సరఫరా కావడం లేదని మండల ప్రజలు ఆరోపించారు. సంబంధిత అధికారులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో కామారెడ్డి - భీమ్‌గల్ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఇరువైపులా ట్రాఫిక్ జామ్ కావడంతో విషయం తెలుసుకున్న పోలీసులు వారి వద్దకు వచ్చి రాస్తారోకోను విరమించాలని కోరగా వారు ససేమిరా అనడంతో ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుపతి రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. రేపటి లోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు రాస్తారోకోను విరమించారు.

లింగంపేటలో పీఎంపీ ఆసుపత్రుల తనిఖీ

లింగంపేట, ఆగస్టు 28: కలెక్టర్ ఆదేశాల మేరకు లింగంపేట మండలంలోని పీఎంపీ ఆసుపత్రులను బుధవారం ఎంపీడీవో నరేష్, మెడికల్ ఆఫీసర్ హిమబిందులు తనిఖీ చేశారు. ఎంపీఎం ఆసుపత్రుల్లో జ్వరానికి ఎలాంటి ట్రీట్‌మెంట్ అందించ వద్దని వారు ఆసుపత్రుల నిర్వాహకులకు హెచ్చరించారు. ఎవరైనా జ్వరంతో వస్తే ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలని వారికి సూచించారు. ఆసుపత్రుల్లో ఉన్న వసతులను వారు పరిశీలించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - డబుల్ ఇస్మార్ట్
దర్శన్ - మిస్టర్ బచ్చన్
ప్రియా 70 - తంగలన్
ప్రియా 35 - ఆయ్

బాన్సువాడ

మహేశ్వరి - సరిపోదా శనివారం
వెంకటేశ్వర - తంగలాన్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

